# కలిసిరాని కవిత

''గాయత్రీ,

దీపావళి కథలపోటీ — సచిత్ర — వారపత్రిక ప్రతి ఏడాదిలానే ఈమారూ ప్రకటించింది. మరి నీవు కథ వ్రాస్తున్నావుకదూ ? ఎంతవరకొచ్చింది ? అన్నట్లు ముగింపు తేదీ కూడా దగ్గర పడుతోంది. నీ కథ చిత్తుప్రతి నాకు పంపిద్దూ. పోటీఫలితాలు తెలిసేవరకూ ఈ సస్పెన్సు భరించలేను. పంపుతావు కదూ ?'' అంటూ ప్రశ్నల పరంపరలతో వ్రాసిన నీ ఉత్తరానికి జవాబేం వ్రాయాలో తోచటంలేదు. నన్ను వెనుకటి ప్రఖ్యాత రచయిత్రి రాధగానే తలుస్తున్నావు కదూ? కాదు. ఆ రాధను నేను కాను. ఆ రాధలో ఊహలున్నాయి. భావావేశముంది. కవితాశక్తి ఉంది. కల్పనా పటిమ ఉంది. అన్నిటినీ మించిన ఆత్మవిశ్వాసముంది. కానీ ఈ నాడా రాధ లేదు. ఇప్పుడున్న ఈ రాధ (నేను) లో జీవం మాత్రం ఉంది. జీవకళ లేదు. భావాలున్నాయి. అనువదించే భాష లేదు. కల్పన ఉంది. కవిత చచ్చిపోయింది. పోటీకి కథా ? హుఁ ! జీవితాన్ని మించిన కథేముంటుంది ? ఇది కవిత కాదు. కల్పన అంతకంటే కాదు. జీవితంలోని వివిధానుభవాలు తాలూకు, ఉత్సాహ, ఉత్పాత ఝుం ఝా మారుతాల తాకిడిలో హృదయఫలకంపై నిలిచిన వాస్తవిక దృశ్యకావ్యమిది. నా శరీరం పోవచ్చు. లేకుండాపోవచ్చు. కానీ ఈ నా అనుభవాల సమగ్రరూపం చెరిగిపోదు. అర్థంలేని వేదాంతం

వ్రాస్తున్నానని చిరాకు పడకు. జీవితాన్ని స్పందింపజేసే దివ్య నాదం లోపిస్తే, ఇక వచ్చేది వేదమూ, మిగిలేది అంతమే!

రెండు సంవత్సరాల క్రితం నా "మృగతృష్ణ" కథకు ప్రథమబహుమతి వచ్చింది గుర్తుంది కదూ! అప్పటికి నేను 'కుమారి' రాధనే! నా ఫోటో ప్రచురించారు పత్రికలో కథతోబాటు. ఆ సమయంలో, నా ఆనందం ఏమని వర్ణించను? నవమాసాలూ మోసి, కనిపెంచిన తనబిడ్డ ప్రయోజకుడై పలువురి ప్రశంశలు అందుకుంటున్న సమయంలో మాతృ హృదయంలో ఉప్పొంగే ఆనందాన్ని నే ననుభవించలేదు. కానీ ఊహించగలను. ఎండనక, వాననక మట్టిలో, బురదలో స్వేదబిందువులు రాలుస్తూ, భూమిదున్నిన కర్షకుడు, అందులో కన్నులపండువుగా పండిన పైరును చూచి ఆనందించే అను భూతి నే ననుభవించలేదు. కానీ అర్థం చేసుకోగలను. దరి ద్రంలో మ్రగ్గుతున్న పేదవానికి పెన్నిధి దొరికినప్పటి మన స్థితేమిటో నా కవగాహనయింది.

బంధువర్గంనుంచి ప్రశంశలు కుప్పతిప్పలుగా వచ్చాయి. తల్లిదండ్రులనుంచి ఆశీర్వచనాలూ, అన్నయ్య వద్దనుంచి ప్రోత్సాహమూ, స్నేహితుల అభినందనలతో ఉక్కిరి బిక్కిరై పోయాను. "ఇంత చిన్న వయస్సులో ఇన్ని ప్రశంశలా? ముందు దిష్టి తీసెయ్యాలి!" అంటూ హడావుడిగా వెళ్ళింది అమ్మ.

"నీ కుమార్తె కప్పుడే దృష్టి తగలదు లేవే! ఇంకా ఎన్ని మంచి రచనలు వ్రాయాలో..." నాన్నగారి కంఠ స్వరంలో కొద్దిగా గర్వంకూడా తొణికిసలాడుతోంది.

"ఏదో గుడ్డేటుగా వచ్చిందిలే బహుమతి. నేనే నిర్ణయాధికారినైతే నీ కథ కసలు ఛస్తే కన్సొలేషన్ కూడా ఇవ్వను." అన్నయ్య హేళనాపూరిత ఆప్యాయత.

"నీ కింకా పెళ్లి కాలేదుకదా? నీ కథానాయకీ నాయకులను శృంగార తరంగాలలో అంత చక్కగా ఎలా ఓలలాడించ గలిగావు రాధా?" శ్యామల ఒదిన ఆశ్చర్యం. అన్నిటికీ అతీతమైన భావన ఒకటే నాకు కలిగింది. అది ఆనంద పారవశ్యమో, గర్వమో ఏమో మరి!

వారం తిరిగేసరికి ఎవరెవరో కలం స్నేహితులు నా స్నేహం కోరుతూ ఉత్తరాలవర్షం కురిపించటం మొదలెట్టారు.

ఒకామె "చెల్లాయీ! చిన్నదానివయినా, ఇంత చక్కటి కథ వ్రాసినందుకు నా కెంతో సంతోషంగా ఉంది. ముందు ముందు ఇంకా మంచి రచనలు నీవి చూస్తానని ఆశిస్తున్నాను." అంటూ వ్రాసింది. నా చిన్నతనంలో చనిపోయిన మా అరుణక్కయ్య ఆ ఉత్తరంలో ప్రతిబింబించి, ప్రేమతో నా హృదయం ఆర్ద్రమైపోయింది. మరొకతను "సోదరీ! నీ మృగతృష్ణలోని శారదలాటి చెల్లాయి నాకు ఉండేది. ఆమె ఈ మధ్యనే చనిపోయింది. నీలో కనీసం ఆ "శారద" లోని కొన్ని గుణాలయినా ఉండి ఉండాలి. లేకుంటే ఆ పాత్ర పోషణ అంత చక్కగా ఉండటానికి అవకాశం ఉండేది కాదు. నన్ను నీ సోదరునిగా భావించి, నాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ, నాకు కొంత మనశ్శాంతిని చేకూర్చగలవా?" అంటూ వ్రాశాడు. ఆ ఉత్తరమంతా సోదరప్రేమతో నిండి

ఉంది. ఇలా ఒక్కో ఉత్తరమూ ఒక్కొక్క రకంగా ఉన్నాయి. అవి చదువుతున్నపుడు నాలో కలిగే భావాలను ఏమని చెప్పను ? ఆ సంతోషాన్ని పంచుకోవటానికి శ్యామల ఒదినను సాయం కోరాను. ఆమెకా ఉత్తరాల్లో ప్రత్యేకతేమీ కన్పించలేదు కాబోలు. తేలిగ్గా నవ్వేస్తోంది చదివి. ఆఖరు కవరు చాలా బరువుగా ఉంది. పట్టుకోంటేనే తెలుస్తోంది పేద్ద ఉత్తరమని.

"ఎవరో నీ కథను గురించి నవలంత విమర్శ, సీరియల్ కథంత ప్రశంశలూ వ్రాసి పంపినట్లున్నారు" అంది ఒదిన నవ్వుతూ.

"ఊఁ" అంటూ చింపాను.

లేతనీలంరంగు కాగితాలపై, ఇండియన్ ఇంకుతో వ్రాసిన చక్కటి దస్తూరి!

"రాధా దేవీ !

ఈ ఉత్తరం పూర్తిగా చదివిన తర్వాత నన్ను కోపగించుకుంటారో, అసహ్యించుకుంటారో, నేను మీకు పెన్ ఫ్రెండ్ గా కూడా ఉండతగనని నిర్ణయించుకుంటారో నాకు తెలీదు. కానీ ఈ లేఖ మీకు వ్రాయాలనిపించింది, వ్రాస్తున్నానంతే!

నా పేరు ఉపేంద్ర. డాక్టర్ డిగ్రీ పుచ్చుకుని, ప్రాక్టీస్ పెట్టాను. మా అమ్మ, ఇద్దరు చెల్లాయిలు (రమ, రాధ) ఒక తమ్ముడు నరేంద్ర ఉన్నారు. ఏమంత ఎక్కువ స్థితిపరుణ్ణి కాదు. కానీ భుక్తికి లోపంలేదు..."

"ఏమిటే సొద ?" విసుక్కున్నాను.

"కొంగుదీసి పెళ్ళి చేసుకోమంటాడేమిటే నిన్ను ?" ఒదిన గలగల సెలయేరులా నవ్వింది.

"ఫో వదినా ! నీది మరీ వేళాకోళం. అలా వ్రాస్తేనా ?..."

"ఏం ! ఏంచేస్తావేమిటి ? ముందు చదివిన ఉత్తరాల్లో వారి భావాలను నువ్వు అరికట్ట గలవా ?"

"అయితే ?" ఒదిన మాటలు అర్థంకాలే. చిరాకు ముంచుకొచ్చింది.

"ఏమీ లేదులే! ఉత్తరం చదువుకో, నీతో బాటు నేనూ ఇక్కడే కూర్చుండి పోతే నాకు పనెలా అవుతుందీ ?" సన్నగా నవ్వుతూ వెళ్లిపోయింది ఒదిన.

"ఫో ఫో మహా బుద్ధిమంతురాలివి !"

జాబు తిరిగి చదవటంలో నిమగ్నమైపోయాను.

"...ఇలా నన్ను నేను ఎందుకు పరిచయం చేసుకుంటు న్నానో... మీరు రచయిత్రులు గనుక, బహుశా ఈ సరికి అర్థం చేసుకునే ఉంటారు..."

నా మొహం ! ఏ మర్థం చేసుకోగలను ?

"మీ మృగతృష్ణ కథ హృద్యంగమంగా ఉంది. 'కుమారి'గా ఇన్ని ఊహలు మదిలో దాచుకోనగల మీరు అసాధ్యులు సుమండీ! అమృత వాహిని సాగిన ఆ కథలో "శారద" పాత్ర ఎవరో కాదు. మీరే! కదూ ! కాకుంటే అంత

చక్కగా, ఎలా తీర్చిదిద్దుతారు? శారదలోని పొంగ్గా! వారే ప్రేమా, రామకృష్ణతో హద్దులుమీరని ఆమె ప్రవర్తనా, సున్నితమైన ఆమె మనోభావాలూ, ఆత్మాభిమానమొకటేమిటి? శారద పాత్రలోని గుణాలు, ఫోటోలోని మీరూ, నేనూహించుకున్న మీ రూపమూ, ఒక్కటే! నమ్మండి, మానండి. నాకు విమర్శలుగానీ, కథలు గానీ వ్రాయటం చేతరాదు. కానీ మృగతృష్ణ కథ నన్నింతగా కదిల్చివేసి ఈ లేఖ లాటి కవిత్వాన్ని వ్రాయిస్తోందంటే అతిశయోక్తి కాదు.

నా కులగోత్రాలు కూడా వ్రాస్తున్నాను... నేను ఒక్కటే అర్థిస్తున్నాను. అది నా పేరాసేకావచ్చు. కానీ దాన్ని నేను నిగ్రహించుకో లేకపోతున్నాను. ఇందాకా వివాహం మీద ఇష్టంకానీ, మరే స్త్రీ మీద మమకారం కానీ కలుగలేదు నాకు. కానీ ఎందుకో ఈ క్షణంలో మిమ్మల్ని తప్ప మరెవ్వర్నీ వివాహం చేసుకోన గూడదని నిర్ణయించుకున్నాను. ఒక వేళ మీరు తిరస్కరించినా సరే! నే నిలాగే బ్రహ్మచారిగా ఉండిపోతాను.

బహుశా ఈ సరికే సభ్యత్వపు సరిహద్దులు దాటానేమో! నన్నెలా ఊహించినా, నేనేమీ చెయ్యలేను. క్రింద నా అడ్రస్ ఇస్తున్నాను. జవాబు వ్రాస్తారు కదూ?

మీ

ఉపేంద్ర''

''మీ ఉపేంద్ర''ట! ఎంత సాహసం! ఎంత పొగరు! ఫోటో చూచి ''కుమారి'' అని తెలియగానే ఇలాటి ఉత్తరం

స్తాడా ? పెళ్ళి విషయంలో పెద్దవాళ్ళుండగా, నాకు త్తర ప్రత్యుత్తరాలేమిటే? ఇలాగనుకైతే ఇక ఎందరి వద్ద ఖండి ప్రశంశల పేరుతో, ప్రేమలేఖలూ, అభ్యర్థనలూ. వస్తాయో! అంతా అగమ్య గోచరంగా ఉంది. కోపంతోనూ, అవమానంతోనూ మనస్సు క్షుభితం అవుతోంది. అసలా కథ ఎందుకు బహుమతి పొందింది ? బహుమతి వచ్చిందే పో, ఇంద రెందుకు ఉత్తరాలు వ్రాశారు ? వ్రాసినా ఇలాటి ఉత్తరం ! అసలు పత్రికకు ఫోటో పంపించకుండా ఉంటే బావుండే దేమో !

"ఎవరు వ్రాశారు రాధా ?" ఒదిన గొంతు విని ఉలిక్కి పడ్డాను.

బాబోయ్ ఎలా ? ఏమని చెప్పను ? చెబితే ఏమను కుంటుందో? ఈ సంగతి అన్నయ్యకూ, నాన్నగారికీ, అమ్మకూ తెలిస్తే ఇంకేమైనా ఉందా ? అసలే ఈ ఉత్తరాలు రావ టంతో అమ్మ ధుమ ధుమ లాడుతోంది ! ఎంత కఠిన పరీక్ష పెట్టావ్ భగవాన్ ! క్షణం క్రితం ఆనందసాగరంలో తేలి యాడ్తున్న నన్ను, మరు నిముషంలో అంధకార కూపంలోకి నెట్టావా ? బయటపడే మార్గమేది ?

కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. నన్ను పరీక్షగా చూస్తోంది ఒదిన.

"ఛ ! అదేమిటే రాధా కన్నీళ్ళు ? ఎందుకూ ? ఏదా ఉత్తరం ?" నా అనుమతితో నిమిత్తం లేకుండా తీసుకుని చదువుతోంది వదిన. దోషిలా కూర్చుండిపోయాను.

చదివి ఒక్క నవ్వు నవ్వేసింది ఒదిన. "పిచ్చిపిల్లా! ఇందుకా బాధ! ఎవరి భావాలు వారివి. అంత మాత్రాన ఇలా కంగారు పడతావేమిటే? పత్రికా ముఖంగా వ్రాసిన వ్యాసమయినా, పదిమందికి తెలిసి చేసేపనయినా, ఇలా రక రకాల విమర్శలకూ గురి కాక తప్పదు. కొన్ని చేదుగా, మరి కొన్ని తియ్యగా, ఇంకాకొన్ని భరించలేనంత బాధాకరంగా ఉంటాయి. వాటిని లెక్క చెయ్యకూడదమ్మాయ్!" ఒదిన ఉపన్యాసం దంచేస్తోంది.

"అది కాదమ్మా ఒదినా? ఈ జాబులో అంతరార్థమేమిటంటావు? హేళనా? లేక నిజంగానే అలా ఫీలయ్యుంటాడంటావా?" అన్నాను.

"ఏమో! ఏమైనా కావచ్చు. వ్రాయటాన్ని బట్టి చూస్తే ఉపేంద్ర నిజంగానే ఇలా వ్రాసుంటాడనిపిస్తోంది."

"ఎవరా ఉపేంద్ర? ఏమని వ్రాశాడు?" గడప దగ్గర్నుంచి అన్నయ్య తీక్షణ దృష్టితోబాటు, గర్జనకూడా నా గుండెల్ని చీల్చివేసింది. గుండె ఆగిపోయేట్లవుతోంది. ఇంతవరకూ మా సంభాషణ అన్నయ్య వింటున్నాడా? ఆపాద మస్తకమూ కంపించిపోయాను.

"ఏమీ లేదు." వదిన మాటలు మధ్యలోనే ఉండిపోయాయి. అన్నయ్య చేతిలోకి ఉత్తరమూ, దానితోపాటు ఆయన ముఖకవళికలూ మారిపోయాయి.

"ఊఁ, బావుంది నిర్వాకం!" అగ్ని శిఖలాటి చూపు నాపై విసరి, ఉత్తరం జేబులో పెట్టుకొని వెళ్లిపోయాడు అన్నయ్య.

ఒదిన గుండెల్లో తల దాచుకున్నాను.

నిద్ర లేచేసరికి అన్నయ్య హైదరాబాదు వెళ్లాడని తెలిసింది. హడలిపోయాను.

ఉపేంద్ర గుర్తుకు వచ్చాడు. అతని అడ్రస్ క్రింద హైదరాబాదు అని ఉంది! అవును అన్న యీ విషయమే ఆరా తీయటానికి వెళ్లాడు. ఆ ఉత్తరం చూపించి ఎంతగా గొడవచేస్తాడో! అసలేమవుతుందో? రాత్రినుంచి ఈ విష యమే ఆందోళనగా ఉన్ననాకు ఈ క్షణం నుంచీ మరింత భయం పట్టుకుంది.

అమ్మ నడుగుదామంటే భయం. ఒదిన్నడిగితే ఏమను కుంటుందోనని సందేహం. ఊరుకున్నాను. పుచ్చపువ్వులాటి వెన్నెల లోకా న్నావరించింది. అమ్మా, నాన్నగారూ ఏదో ఇంటి విషయాలు మాట్లాడుకుంటున్నారు. మధ్యమధ్యలో నా పెళ్ళి ప్రస్తావన వస్తోంది.

''దీనికొక్కటీ ఆ మూడుముళ్లూ పడిడే అంతేచాలు!'' అమ్మ ఆదుర్దాగల కంఠస్వరం. బహుశా అమ్మకు, నాకు పెళ్ళి కాదని భయమేమో!

''సాయంత్రం చూడండి! స్నానాల గదిలోకి వెళ్ళిందా! గంటన్నర తర్వాత స్నానం చెయ్యకుండానే బయటికి వచ్చింది. ఇంతసేపు లోపలేం చేస్తున్నావే రాధా? అన్నాను. త్రుళ్ళి పడి ఏదో కథ ఆలోచిస్తున్నానే...స్నానం చేసొస్తాను. అని మళ్ళీ లోపలికి పరుగెత్తింది. ఏం మాయదారి కథలో! అస్త మానూ ఆలోచన...రాత్రింబగళ్ళు రాతలూనూ, పిచ్చెక్కి-

పోతుందో ఏమో...'' అమ్మ బాధతో నిట్టూర్చింది. నాకు నవ్వాగటం లేదు. "ష్! నీదో గోల, అందరికీ ఆ రచనా సామర్థ్యం ఉంటుందంటావా? అందులోనూ ఇంత చిన్న వయసులోనూ! మన బిడ్డ, మనం పొగడకూడదు కానీ ఎంత చక్కగా వ్రాస్తుందో నీకు తెలుసా? ఇంతకూ ఆ ఉపేంద్ర ఎలాంటివాడో అన్నీ విచారిస్తాడుగా మన రామం. అతనికీ ఈ కవిత్వమంటే ఎంతో అభిలాష ఉన్నట్లుంది. లేకుంటే అలా వ్రాయడు. అన్ని విధాలా నచ్చితే, ఈ సంబంధమే స్థిరం చేద్దాం. దానికి మంచి ప్రోత్సాహం కూడా ఉంటుంది". అతనివల్ల నాన్నగారింకా ఏదేదో మాట్లాడుతున్నారు. నా సర్వేంద్రియాలు పట్టు తప్పాయి! ఇంట్లో అందరికీ తెలుసు! తెలియనట్లు నటిస్తున్నారు! ఎంత నిండుదనం వీళ్ళందరికీ? ఇక నిశ్చింతగా పడుకున్నాను. ఒకవేళ ఉపేంద్ర అల్లరి చిల్లర రకమయితే అన్నయ్య బాగా బుద్ధిచెప్పి వస్తాడు. లేకుంటే...రకరకాల ఊహలలో తేలిపోయాను. ఉపేంద్ర రూపం అస్పష్టంగా చందమామలో క్షణకాలం కన్పించింది! అత నెలా ఉంటాడో? ఏమో? ఏవో శృంగార భావతరంగాలు హృదయాన్నావరించు కుంటున్నాయి. అమ్మయ్యో! ఈ వూహాలే నా రచనల్లో తొంగిచూస్తాయి వద్దన్నా. మృగతృష్ణలోని శారదా రామకృష్ణుల ప్రణయలీలలు, ఏమీ తెలియని నా కన్య హృదయంలో నుంచెలా ఉద్భవించాయి? నాకా విషయంలో అనుభవం ఏముంది కనుక? కానీ అందరూ ప్రశంసించారు! అవివాహితనయిన కన్యను అలా ఎలా వ్రాయగలిగాను? వ్రాసేటప్పుడు ఇంత తర్కించుకోలేదు.

శారద పాత్రలో దోబూచులాడాను. ఒక్కోసారి "శారద" లీనమైన నా హృదయావేశపు భావాలను బయటపెట్టాను. అది విమర్శనాత్మక దృష్టితో పరిశీలిస్తేగానీ అవగాహన కాదేమో! ఉపేంద్ర నన్నలాగే నా కథలో దర్శించి ఉంటాడు. శారద పాత్రను చిత్రకారుడు పత్రికలో ఓ విధంగా చిత్రించాడు. కానీ అందులో ఏదో వెలితి వుందనిపించింది నాకు. నా శారద రూపం రాలేదు. ఫక్కున నవ్వొచ్చింది. ఉపేంద్ర ఊహించుకున్న శారదా, నా ఫోటో ఒక్కటిగా ఉన్నాయిట! అయితే మాత్రం ఇంత సాహసమా?

"ఇంకా నిద్రపోలేదుటే రాధా?" అమ్మ నా దగ్గరగా వచ్చి నన్ను పరీక్షగా చూస్తోంది. చటుక్కున దుప్పటి తల వరకూ లాక్కున్నాను.

* * * *

చల్లనిగాలి మెల్లగావీస్తూ, నిద్రలో గిలిగింతలు పెడుతోంది. పౌర్ణమి వెళ్ళిన విదియనాటి చంద్రుడు విసుగ్గా, నెమ్మదిగా వస్తున్నాడు ఉసూరుమంటూ! అప్పటికప్పుడే ఏవేవో గజిబిజి ఊహలు అల్లుకుపోతున్నాయి. ఈ ఆహ్లాద పూరిత వాతావరణంలో చక్కటి కథ గబగబా ఉరకలు వేసుకుంటూ వస్తోంది లోపలినుంచి. ఇక అది కాగితం మీద పెడితేగానీ నిద్రపట్టదు. కానీ అమ్మ చూస్తే...అక్షరం సాగ నివ్వదు! అమ్మకే మర్థమవుతుంది నా బాధ!

"ఊఁ అన్నీ బాగున్నాయి!"

త్రుళ్లిపడ్డాను. అన్నయ్యొచ్చాడు. గుండె వేగంగా కొట్టుకుంటోంది! నిద్ర తెర వీడిపోయింది బాగా!

"మనిషి చాలా బావున్నాడమ్మా. నా ఎత్తున్నాడు. నా కంటే కొద్దిగా లావు. మంచి వాడు. మర్యాదస్తుడు. మన మనుకున్నట్లు పోకేలారకం కాదు. అందుకే..." అన్నయ్య మాటలకు అడ్డొచ్చిందమ్మ.

'అదలా ఉంచరా. ఇంతకూ ఆస్తిపాస్తు లేమైనా ?" అమ్మ సందేహం! ఆమె దృష్టిలో ఆస్తిలేని వాడు అసలు మనిషే కాదు.

"ఓ లేకేం ? స్థిరాస్తి ఒక అందమైన చిన్న ఇల్లూ, చుట్టూ చక్కటి పూలతోట. చరాస్థి ఇద్దరు గండా గొండీ పెళ్లి కాని చెల్లాయిలూ, కాలేజీలో చదువుతున్న తమ్ముడు... వృద్ధమాత !"

"ఇంకేం మంచి కుటుంబ మన్నమాట !" అమ్మ సర్టిఫికేటు.

"అబ్బాయి నీకు నచ్చాడా రామూ ?" నాన్నగారడి గారు.

"భేషుగ్గా ! కానీ మన అమ్మాయికి నచ్చొద్దూ అత గాడు ? అతగాడేమో ఈ క్షణమే పెళ్ళి చేసుకునేట్లున్నాడు దీన్ని. అసలిక చూడక్కర్లేదుట కూడా..."

నాకు నవ్వొచ్చింది. ఒకవేళ ఫోటోలో పడని ఏ కాలో చెయ్యో అవకరం ఉంటేనో ?

"...అయినా మన రాధ పెద్ద రచయిత్రికదా! అన్నీ కుదుర్చుకున్న తర్వాత 'నా కథానాయకుడిలా లేవు, పొమ్మంటే అభాసుపాలవుతాం! అందుకే ఓ మారు లాంఛన

ప్రాయంగా రమ్మన్నాను పెళ్లిచూపులకు. ఎల్లుండి వస్తారు అతగాడూ, మరో స్నేహితుడూను..."

అన్నయ్య నిండుదనానికి ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగాయి. నన్ను చీవాట్లు వేసి ఎంత రభసో చెయ్యకుండా, కార్య కలాపాలు చక్కబరిచాడు. కృతజ్ఞతతో నా మనస్సు నిండి పోతోంది. ఇలాటి మంచి అన్నయ్య లెంతమంది ఆడ పిల్లలకుంటారు? "ఆడపిల్లలూ—అన్నయ్యలూ" అనేవ్యాసం అప్పుడే మెదుల్తోంది తలలో! అక్కడే అణచివేశాను.

"ఎందుకలా దుప్పటిలో నానాయాతనా పడతావే రాధా! ఎల్లుండి వస్తాడు. బాగా చూద్దువుగానీలే!" అన్నయ్య నామీదకు వంగి చెవిలో అన్నాడు. గడ్డకట్టుకుపోయాను!

ఆ 'ఎల్లుండి' రానే వచ్చింది.

తల ఎత్తలేను. సరిగా చూడలేను. మనస్సు చూడ మని హెచ్చరిస్తోంది. కళ్లు వాలిపోతున్నాయి వద్దంటూ. రచనలో ఏమో మో వ్రాయగల నేను వాస్తవిక ప్రపంచంలో నా ఎదురుగా ఉన్నవ్యక్తినే పాకమా రేనా చూడలేకపోతున్నా నెందుకో? ఇదే కాబోలు ఊహలకూ నిజాలకూ ఉన్న తేడా!

"అమ్మాయ్ రాధా!" అన్నయ్య గొంతు నా ఎదురు గది దగ్గర్నుంచి గట్టిగా విన్పించింది.

చటుక్కున తలెత్తాను అప్రయత్నంగా!

నా దృష్టి మధ్యలో ఉపేంద్ర ఉన్నారు! ఎంత చక్కటి విగ్రహం? ఎంత అందమైన కళ్లు? నావేపే చూస్తున్న ఆ

కళ్లల్లో ఎంతటి చిలిపితనం దాగిఉందో! నా అవస్థను గమనిస్తూ రాబోయే నవ్వు నణచుకుంటున్న ఆ పెదవుల కదలికలో ఎంతటి సౌందర్యం దాగి ఉంది! నా వూహా సుందరుడు, నా కథానాయకుడనబడే వ్యక్తైవరేనా వుంటే అతడు ఉపేంద్ర! స్త్రీలు, అందులోనూ నేను నా హృదయంలో ఊహించుకునే వర్ణనలకు సరిగ్గా సరిపోయాడు ఉపేంద్ర! అన్నయ్య వచ్చి అతని పక్కన కూర్చున్నాడు. బుద్ధిపూర్వకంగానే పిల్చాడన్న మాట! ఇక తలపైకి లేవలేదు. లేవ్వాల్సిన అవసరమూ లేదు.

"ఇందాకా వూహల్లోనే ప్రణయ సామ్రాజ్యాధిపత్యం వహించావ్, ఇక నిజ జీవితంలో అనుభవిద్దూగానీలే, ఇంకా చక్కటి కథలు వ్రాస్తావు..." వదిన మెల్లిగా చెవిలో చెబుతోంది, నా తలలో మరో పూలదండ తురుమటానికి వ్యర్థ ప్రయత్నంచేస్తూ.

"ఒదినా! ఇదేం తలనుకున్నావా లేక..."

"...అహ లక్షలాది ఊహాలున్న బ్రహ్మాండమైన పర్వత మనుకుంటున్నాను." ఒదిన నవ్వుతోంది.

గదంతా అగరువత్తుల పరిమళంతో నిండిపోయింది. విచ్చిన మల్లెలు సౌరభాల్ని వెదజల్లుతున్నాయి. ఏదో భయం, ఏదో తెలియని ఊహాలతో హృదయం నిండిపోతోంది. ఎదురుగావున్న నిలువుటద్దంలో నా ప్రతిబింబం కన్పిస్తోంది. మొయ్యలేనంతటి బరువుతోవున్న మల్లెపూలజడ, తెల్లటి దుస్తులలో, నాకే ఆశ్చర్యంగావుంది నా రూపం! మరు నిముషంలోనే సిగ్గుతో అడుగుముందుకు పడలేదు,

ఉపేంద్ర...దగ్గరవుతున్నకొద్దీ గుండె వేగం హెచ్చు తోంది...ఆపాదమస్తకమూ చిరుగాలికి కంపించే లతలా వణికి పోతున్నాను.

ఆ మధురానుభూతిని వర్ణించలేను. అందు నిబిడీకృతమై యున్న శృంగారభావాలు భాష కతీతమైనవి. ఆ స్పందనలే, ఆ ప్రణయ మనోజ్ఞరూపమే, సృష్టి మూలమేమో! ఆ పార వశ్యం మరొకరికి విడమరచి చెప్పలేనిది. అందులోని కాల గమనం కూడా తెలియదేమో!

"కథలలో, కన్యగానే అంత చక్కగా వ్రాయగలిగిన నువ్వు, ఇలా బెదురుతావేం రాధా?" వారి కంఠస్వరంలోని మాధుర్యం, నన్ను పులకరింపజేస్తుంది. ఆ రసాస్వాదనలో వున్న నాకు సమాధానం చెప్పటానికేం తోస్తుందీ?

"రమనూ, రాణినీ చూచావుగా? ఇద్దరు ఒకరికొకరు పూర్తి వ్యతిరేకులు..." వారు చెప్పుకుపోతున్నారు.

"ఏమిటలా చూస్తున్నావ్ రాధా నావేపు?" గబు క్కున మధ్యలో ఆపి నావేపు చూస్తున్నారు. వారి సౌందర్యా రాధనలో మైమరచిపోతున్న నేను వారిమాటలు వింటుంటే కదూ?

"ఏం లేదు. మీలాటి భర్త, మీ చెల్లాయిల్లాటి ఆడ బిడ్డలూ, అత్తగారూ, చక్కగా మర్యాద ఇచ్చే మరదీ, చల్లని సంసారమూ, ఇంతకంటే ఏ ఆడదానికి మాత్రం కావల సిందేముంది? కోరుకునేదేముందీ? అదే ఆలోచిస్తున్నాను" అన్నాను.

"అదే, ఆ ఆలోచనలే వద్దు. ఇప్పుడో కథ రాసేస్తానంటావ్...బంగారంవంటి కాలం కరిగిపోతుంది..."

పుట్టినప్పటినుంచీ కనిపెంచిన తల్లిదండ్రుల్ని, అపురూపంగా చూచుకునే సోదరీసోదరులనూ, చనువున్న ఒదినలనూ, అలవాటుపడ్డ వాతావరణాన్ని ఒక్కసారిగా వదిలి వెళ్లటంలో ఎంతటి హృదయావేదన నిండి ఉంది ? స్త్రీకి తనలోని స్వార్థత్యాగానికి మొదటి సోపాన మిదేనేమో! చీకటి వెలుగుల సాలెనేతతో సృష్టింపబడ్డ విశాల విశ్వంలో కష్టమూ, సుఖమూ, సంతోషమూ, దుఃఖమూకూడా పక్కపక్కనే ఉంటాయి. కన్నవారి నుంచి దూరమవుతున్న వియోగమూ, కట్టుకున్న వారితో కలసి వెళ్తున్న ప్రయాణ యోగమూ, ఒకదాని వెంట ఒకటి ఎండా వానల్లా మనసు నాక్రమించుకున్నాయి. 'ఎలా వ్రాశారు ఉత్తరం నాకు ? ఎంత ధైర్యం?' అన్నాను కాస్త మనసులోని బిడియం మాటుమణిగిం తర్వాత చిరుకోపం అభినయిస్తూ.

"అలా వ్రాయబట్టే కాదూ ఇలా జరిగింది ?" వారి స్మిత నయనాలలో చిలిపిదనం తొంగిచూస్తోంది.

చక్కటి ఆ కళ్లల్లోని ఆప్యాయత చూస్తూ, చిరుగాలికి చెదిరే నా ముంగురులను వారు సవరిస్తూ, అలా కబుర్లలో పడితే, అమావాస్య రాత్రయినా నిండు పున్నమిలా ఉంటుంది. యుగాలే క్షణాలుగా మారుతాయి. ఒక క్షణంలో అనురాగం మరునిముషంలో చిరుకోపం, ఆ తర్వాత క్షణంలో చిన్నకలహం, అటుపై ఆవేశం, ఆమీద సమన్వయం ఆ తర్వాత ప్రణయం. ఇలా ఇంద్రధనస్సులాంటి దాంపత్య జీవిత

మధురాను భవాలను ఎలా వర్ణించగలను ? ఆ యా సంఘటనల తాలూకు దృశ్యాలను కాగితంమీద పెట్టాలనుకోవటం కూడా సాహసమే. కన్యగా ఉన్నప్పుడు...ఇలాటి ఊహలు కలిగినా, అవి వ్రాయటానికి మనసు వెనుకాడేది. "కన్యవు, నీకేం తెల్సు...ఇది తప్పు. ఇలా వ్రాయకూడదు. బుజువేమిటి ?" వగైరా రకరకాల విమర్శలు వస్తాయేమోనని భయం. కానీ ఇప్పుడది లేదు. ఏ ఘట్టాన్నయినా తుణ్ణంగా వర్ణించగలను. పరిపూర్ణత్వం సిద్ధింప జేయగలను.

చక్కటి చిన్న ఇల్లూ, చుట్టూ అందమైన పూలతోట, విరిసిన గులాబీల వింత పరిమళం. షుమారు నాలుగు నెలలుగా ఏరచనా వ్రాయలేదు. అచ్చులో నా పేరు పడనూ లేదు. ఒదిన వ్రాయనే వ్రాసింది.

"రాధా! నువ్వు కథలు రాయటం మానేశావ్ ! కారణం నాకు తెల్సులేవోయ్. ఉపేంద్రన్నయ్యను చూస్తూ అన్నీ మర్చిపోతున్నావ్ అవునా ?" అంటూ.

నిజమే మరి. ఎప్పుడేనా వ్రాయడానికి కూర్చుంటానో లేదో—

"చూడురాధా! ఆ రాత తర్వాత రాసుకుందుగానీ... ముందిలా రావోయ్." అంటారు. వెళ్లక తప్పదు. వెళ్లిం తర్వాత ఇక తిరిగి కాగితాల దగ్గరకు రావటమూ అరుదే !

"ఇదుగో, షుంది కాస్త చిత్తూ వ్రాసుకోనీండి. ఫేర్ ఎప్పుడో ఒకప్పుడు వ్రాసుకుంటాను" అన్నా నొకసారి.

"అదేం కుదరదు. అది యిలా ఇవ్వు." నా ప్రమేయం లేకుండానే కాగితాల్ని కిటికీలోనుంచి బయటికి పారేశారు. నిలువెత్తున వచ్చిన నా కోపం వారి కళ్లలోని అనురాగంలో కరగిపోయింది!

ఇదే వరస.

ఇంటిపనులు మధ్యాహ్నం వేళవరకూ సరిపోతాయి. కాగితాలు పెట్టుక్కూర్చుంటానో లేదో రమ పరుగెత్తుక వస్తుంది "ఒదినా, ఏం రాస్తున్నావ్? నాకు చూపించవూ" అంటూ.

"ఇంకా మొదలెట్టనే లేదమ్మా! అయినా ఇప్పుడు చూడకూడదు" అన్నాను.

"మరెప్పుడు?" అంది గోముగా.

"అచ్చులో వచ్చాక"

"రాకుంటేనో?" రాణి చిలకపలుకు... "శుభం పలకరా" అన్నట్లు.

"రాణీ పిచ్చివాగుడు వాగక!" కోపంతో రెచ్చిపోయాను.

అత్తయ్యకు కోపం వచ్చింది. "దాన్నలా కసురుకుంటావెందుకమ్మా?" అంది.

ఆ రోజు ఇంట్లో చిన్నసైజు గొడవ రేగింది! ఆ కాగితాలు డ్రాయర్లో పెట్టేశాను అలాగే.

జరిగిపోయినవి లీలగా గుర్తుకు వచ్చాయి. గబగబ కాగితాలూ, పేనా తెచ్చుక్కూర్చున్నాను.

"మధుర యామిని...కోయిల మంజుల నాదం, మలయానిలుని మందహాసం..." కాగితంమీద చకచక సాగుతోంది పేనా ! తలలో ఊహలు ఊయల లూగుతున్నాయి. మనస్సు వాటిని క్రమపద్ధతిలోనికి లాగుతోంది.

"రాధా ! ఏమిటా రాత?" గర్జన విని హడలిపోయాను.

గత స్మృతులన్నీ పక్కకు నెట్టి, మొండికెత్తి, ఈ గులాబీల మధ్య కూర్చుని ఇన్ని నెలల తర్వాత వ్రాయటాని కుపక్రమిస్తే, అడుగులోనే హంస పాదా ?

"ఏదో కథ..."

"కథలూ వ్రాదూను...ఉదయాన్నుంచీ డిస్పెన్సరీలో మగ్గి వచ్చానా ? ఇంటికొచ్చి నిన్ను వెతుక్కోవాలా ?" వారిలోని ఉగ్రస్వరూపం మొదటిసారిగా చూచాను.

"లోనికెళ్ళి ఫలహారం సిద్ధంచేశాను.

తింటూ నావేపు చూచారు.

"ఏమి టలా ఉన్నావ్ రాధా ? అట్టే ఆలోచించకు. ముఖం చూడు ఎలా పీక్కుపోయిందో ! వెధవ కథలన్నీ ఆలోచించటం సామాన్యమా ? తల నరాలన్నీ ఎక్కువ శ్రమిస్తాయి. జబ్బుచేస్తుంది కూడా."

నేను నవ్వాను. "లేదులెండి. ఈ రోజే మొదలెట్టాను ఉబుసుపోకకు..."

"ఆ! ఏం ఉబుసుపోక...అంతగా తీరిక ఉంటే ఆ తోట పని చూచుకోరాదూ ?" విస్మయం చెందాను.

"మీకు నే వ్రాసుకోవటం ఇష్టంలేదా ?" గబుక్కున అనేశాను కోపంగా.

"ఊహూఁ! చెత్తవ్రాతలన్నీ రాస్తూకూర్చుని ఆరోగ్యం చెడగొట్టుకోవటం నా కెంతమాత్రం ఇష్టంలేదు."

అదిరిపడ్డాను. ఇన్నిరోజులూ ప్రేమగానే వారిస్తూ వచ్చిందిందుకా ?

ఆ రోజుకిక అక్షరం సాగలేదు. అత్తయ్య నిద్ర పోతోంది. రమ, రాణి స్కూలుకు వెళ్లారు. నరేంద్ర కాలేజి నుంచి వచ్చినట్లున్నాడు. ఇక ఆ రెండులైన్లు అయిపోతే వ్యాసం పూర్తవుతుంది...

"వదినా! ఓ వదినా!"

"ఆ! కాళ్లు చేతులూ శుభ్రం చేసుకురా, భోజనం వడ్డిస్తాను." వ్రాసుకుంటూనే జవాబిచ్చాను.

"నాకు ఆకలిగాలేదు. ఏదేనా ఫలహారం చేస్తే తింటాను ... అన్నం వద్దు."

చిరాకేసింది. "ఇప్పుడేం ఫలహారం నరేంద్రా? కాస్సేపు రాసుకుందామని కూర్చున్నాను..." విసుక్కున్నాను. సాగిపోతూనే ఉంది.

"సరే ఏమీ వద్దులే!"

నేను తేరుకునిచూచేసరికి నరేంద్ర లేడు. వెళ్ళిపోయాడు.

నిద్రలేచిన అత్తయ్య విరుచుకపడింది. "ఇంట్లో వాళ్ళ క్కావలసిందేమిటో చూచింతర్వాత కాదూ నీ రాతలూ,

కోతలుంటాను! వాణ్ణలాగ ఆకలితో పంపించావే! ఇలా మహా రాణిలా రాసుకుంటూ కూర్చోవటమేనా మీవాళ్ళు నేర్పింది?''

ఇందాకా దాంపత్య జీవితంలోని తీపినీ, సంసారంలోని సంతోషాన్ని మాత్రమూ చూస్తూవచ్చాను. ఇక రెండవ ప్రక్క కూడా కన్పిస్తోంది!

''అందుకే చెప్పాను రాధా! బాధ్యతలు ముందు. రచనలు తర్వాత. అసలు లేకున్నా ఫర్వాలేదు. గృహిణిగా నీ బాధ్యత నిర్వర్తిస్తే చాలు.'' శ్రీవారి హితబోధతో తల తిరిగి పోయింది. రాత్రి...ఓపిక తెచ్చుకుని వ్యాసం ఫేర్ వ్రాయటం మొదలెట్టాను. పది, పన్నెండు, ఒంటిగంట దాటే సరికి పూర్తయింది. మెల్లిగా మంచంవేపు నడిచాను.

''అప్పుడే పడుకుంటున్నావే? తెల్లవారేవరకూ రాస్తా వనుకున్నాను.'' వారు గొణిగారు.

పలకాలనిపించలేదు. ఎందుకింత కోపం? వారికేమిటి, అందరికీను!

వారం రోజుల్లో వ్యాసం అచ్చయి వచ్చింది పత్రికలో!

''ఒదినా! ఇలా చాటుమాటుగా అనకుంటే స్పష్టంగా ముఖాన్ని చెప్పరాదూ?'' రమకోపానికి కారణమేమిటో తెలియలేదు.

''ఊళ్లో వాళ్లని ఉల్లిపాయలు తినవద్దన్నాడట వెనకటికో గురువుగారు. అల్లాగే అందరికీ నీతులు చెబుతావు గానీ, నీ గృహబాధ్యతలు నువ్వు సరిగా చూచుకుంటున్నావా ఒదినా?'' నరేంద్ర హేళన!

"వెధవ కబుర్లూ, నువ్వూను. రాత్రి తెల్లవార్లూ కూర్చుని చేసిన నిర్వాకం ఇదా? చివర కింట్లో శాంతిలేకుండా పోతుంది నీ మూలంగా" వారి చిరచిరలు!

ఎన్నో నెలల తర్వాత నా రచన వచ్చినందుకు సంతోషం కంటే, అదెందుకు వ్రాశాననే దుఃఖమే మిగిలింది!

ఇంట్లో పనంతా చేసుకుంటున్నాను. రాణి, రమ, అత్తయ్య, నరేంద్ర, వారికి, ఎవరెవరికి ఏ యే సమయాలలో ఏం కావాలో, అడగకుండానే అమరుస్తున్నాను. పగటివేళ తీరినా, పేపర్లు ముట్టుకోవటం లేదు.

వారి దగ్గర కూర్చున్నాను రాత్రి. ఒంటిగంట వరకూ కాలం ఊరికే గడిచిపోయింది. వారు నిద్రపోయారు. మెల్లిగా లేచి ట్రాన్స్‌ఫార్మర్ బల్బు కాంతిలో వ్రాయటం మొదలెట్టాను.

ఎప్పుడు నిద్ర పట్టిందో...

లేచేసరికి అంతా హడావుడిగా ఉంది.

"ఏమిటే మొండితనం? వద్దన్నా వినవు. జ్వరం తగిలింది కూడా!" వారు కోపంతో చిందులు త్రొక్కుతున్నారు.

పడుకున్నాను. అత్తయ్య కాఫీ పట్టుకవచ్చింది.

"ఏం రాతలంటే విన్నావా? నీ ఒళ్ళు పాడుచేసుకుంటే నే చెయ్యలేక చస్తున్నాను..."

"ఆవిడో పెద్ద రచయిత్రి కదమ్మా!" రమ హాస్యం. ఆ ఛీత్కారం, ఏ పరిహాసాలు, ఎందుకంటే చేదుగా ఉందా వాతావరణం. కళ్లు మూసుక పడుకున్నాను.

ఏమిటీ వైపరీత్యం? ఎందుకు వీళ్ళందరికీ కోపం? నా రచనలేం చేశాయి? నేనేం చేశాను? ఉపేంద్ర ఎందుకిలా మారారు? ఒకప్పుడు నా రచనను గురించి పొగిడిన వారేనా కలం ముట్టుకోనివ్వటం లేదిప్పుడు? ఎంచేత? వాళ్ళు చెయ్యలేనిది నే చేస్తున్నానని అసూయా? ఏమిటిది?

తల వేడెక్కి పోతోంది.

నెల రోజుల తర్వాత మళ్ళీ ఆ రోజు రాత్రి రాస్తూ రాస్తూ వదిలిన కథ పూర్తి చేసాను. అచ్చయి వచ్చింది!

మరోమారు చదువుకుంటున్నాను సంతోషంగా!

పత్రిక నా దగ్గరగా వచ్చిపడింది. అదిరిపడి చూచాను. గుమ్మంలో వారు.

"ఏమిటీ రాత? నే తలెత్తుకు తిరగాలా అక్కర్లేదా?"

నా కర్థం కాలేదు.

"ఎవడో 'మనోహర్' అని పేరుపెట్టినంత మాత్రాన నీ మనసులో ఊహలు దాగుతాయా? ఆ మనోహర్ గాడి వర్ణనకూ నాకూ ఎక్కడా సామ్యమే లేదు. ఈ కథ చదివిన ఎవరికేనా ఇట్టే తెలిసిపోతుంది...ఈ రాధాదేవి పూర్వాశ్రమంలో భగ్న ప్రేమికురాలినీ...ఆ ఆవేదనగా వెళ్ళబోసుకున్నావ్?"

ఇక వారి మాటలు నాకు విన్పించలేదు! వారి సంకుచిత మనస్తత్వాన్ని కళ్లారా చూచాను. వెళ్ళి పోయారు. వారు చింపింది పత్రికనూ, అందులోని నా కథనూ కాదు! నన్ను, నా హృదయాన్ని.

నాన్నగారూ, అమ్మా ఆ రోజు రాత్రి నా పెళ్ళికి ముందు...మాట్లాడుకున్న మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి. మిగతావాళ్లనుంచి ప్రోత్సాహం లభించకపోతే మానె! వారు...వారు నాకు ప్రోత్సాహమివ్వరు...సరికదా నన్నింకా నిరుత్సాహపరుస్తున్నారెందుకని ?

శ్రావణ మంగళవారం పేరంటాని కెళ్లేను జయ ఇంటికి. జయ వ్రాసే కథల్లోగానీ, వ్యాసాల్లోగానీ ఏ ఒక్కటీ బాగా లేదు. ఎలాగో అచ్చవుతున్నాయి! అంతక్రితంరోజు దాని వ్యాసమొకటి ప్రచురితమైంది...ఎలాగూ వెళ్తున్నాను... అభినందనలు తెలుపకపోతే బావుండదు.

వరండామెట్లు ఎక్కుతుంటే, లోపల్నుంచి జయ భర్త గొంతు విన్పించింది. రాకూడని సమయంలో వచ్చాను. ఎలా వెనక్కి తిరిగి వెళ్ళటం? అలాగే నిల్చుండిపోయాను.

"ఎంత బావుంది జయా నీ వ్యాసం ? మా ఆఫీసులో అందరికీ చెప్పాను ఈ సంగతి. నువ్వే వ్రాశావని...ఇంకా చక్కగా వ్రాయాలీసారి. సరేనా ?"

బహుశా జయ తల ఊగిస్తుంటుందాయన వడిలో ! ఎంతదృష్టవంతురాలు !

నాన్నగారి ప్రోత్సాహమూ, అన్నయ్య హుషారూ, వదిన అనునయమూ లేకుంటే నాలో అసలా రచనాశక్తి ఉద్భవించేది కాదేమో! ఇక భర్త ప్రోత్సాహమే జయకులా నాకూ లభించి ఉంటే...నాలోని ఆ శక్తి విజృంభించేది కాదా? దుఃఖం ముంచుకు వచ్చింది. వెనక్కి తిరిగి వచ్చేశాను.

"ఒకప్పుడు మీరు నా రచనల్ని, పొగిడేవారు. ఇప్పు డెందుకని ఇలా మారారు ?" అన్నా నా రోజురాత్రి ఉండబట్టలేక.

"ఆ! ఎప్పుడో ఏదో పొగిడానని అస్తమానూ రాసు కుంటూ కూర్చోమంటానా ? పెళ్ళికాకముందలా వ్రాయడమే అనుచితమైన పని. అందులోనూ ఇక గృహిణీత్వం వచ్చాక కూడా ఆ పిచ్చివ్రాతలు వ్రాసుకోడం నా కిష్టం లేదు."

నాలోని రచనాశక్తి నానాటికీ అణగారిపోతోంది. ఊహాలున్నాయి, ఉత్సాహం లేదు. ఆలోచనలున్నాయి. అవకాశం లేదు.

"ఇప్పుడు వెన్నెల వెన్నెలలాగానే కన్పిస్తోంది. మధుర శరశ్చందయామిని"గా అనిపించ లేదు. వారి నవ్వులో వేయి కాంతి కిరణాలు గోచరించటం లేదు. నవ్వు నవ్వుగానే ఉంది. విరిసిన గులాబీలు, స్నిగ్ధ సుకుమార సుందరకుసుమాలుగా నే నూహించటం లేదు. అవి కేవలం గులాబిపూలుగానే కన్పిస్తు న్నాయి. జీవితం సుందర స్వప్నమని భ్రమలతో నిండిన ఆలోచ నలు మానేశాను. చక్కగా, ఒకేఒక గీత పోయే కాలి బాటగా మాత్రం కన్పిస్తోంది.

పోయిన ఏడాది "దీపావళి కథల పోటీ" ప్రచురించారు. నిబంధనలు చదివాను. ముగింపు తేదీ కూడా ఇంకా నెల రోజులు ఉంది. హఠాత్తుగా నాలో అణగారి ఉన్న ఊహాశక్తి విజృంభించింది. కేవలం బహుమతి పొందాలనే ఆకాంక్ష ఒక్కటే కాదు. అవకాశం వినియోగించుకోవాలనే ఆతురత కూడా నిండిపోయింది నాలో.

లేని ఉత్సాహం తెచ్చుకున్నాను. రోజూ రాత్రి బాగా పొద్దు పోయాకగానీ వారు నిద్రపోరు. వారు నిద్రపోగానే వ్రాయటానికి కూర్చుంటున్నాను. నాలుగురోజుల్లో సగానికి పైగా వ్రాశేశాను.

"ఫేర్ మొదలెడదా మనుకొని స్థిర సంకల్పంతో కూర్చున్నాను. భగవాన్ ఈ రచనాశక్తి నిచ్చావ్. దీన్ని సద్వినియోగం చేసే ఈ అవకాశాన్నయినా నాకు కల్పించు తండ్రీ!"

తల వంచుక వ్రాస్తున్నాను.

"ఏమిటది మళ్ళీ కథేనా?" టేబిల్ మీదకు వంగి అడుగుతున్నారు వారు.

"అవును" నిశ్చలంగా చెప్పాను.

"ఎందుకు?"

అర్థం లేని ప్రశ్న!

"ఎందు కేమిటీ? కథల పోటీకి..."

"రాత్రిళ్ళిలా వ్రాసి ఆ పోటీలో సంపాదించే డబ్బు, నీ మందుల ఖర్చుకూడా సరిపోదు..."

నా కసహ్యం వేస్తోంది.

"డబ్బుకోసం వ్రాయటం లేదు..."

"మ రెందుకు?"

శరీరం క్రోధాగ్నితో జ్వలించి పోయింది.

కథా నిలయం 1159 శ్రీకాకుళం

కాగితాలక్కడ పారేసి వెళ్లి పడుకున్నాను. దుఃఖం ముంచుకొచ్చింది. తెల్లవారేసరికి నూటనాలుగు చూపిస్తోంది థర్మామీటరు!

వారం రోజులు తీవ్రవేదనతో గడిచిపోయాయి. అవకాశం కల్పిస్తే, కనీసం ఎవరేనా వ్రాసేవాళ్లుంటే ఒక్క రెండు గంటలపని! ఆ తర్వాత పోటీకి పంపవచ్చు. కానీ ఎలా?

పదిహేను రోజులవరకూ నన్ను కాగితాలు ముట్టుకోకుండా, కట్టుదిట్టం చేశారు. హృదయం క్షోభిస్తోంది. ఇక వారంరోజులే ఉంది గడువు!

వారి దగ్గరగా వెళ్లాను.

"ఏం రాధా? ఎలావుంది?" ఆప్యాయత తొణికిసలాడ్తోందా మాటల్లో!

ఆశ్చర్యం వేసింది. ఇంత అనురాగపూరిత హృదయులైయుండి ఎందుకీ విషయంలో అంత నిర్దయగా ప్రవర్తిస్తారు?

"బాగానేవుంది! పోటీకి ఆఖరు తేదీ దగ్గరకు వస్తోంది. నన్నీ ఒక్క రచనా వ్రాసుకోనివ్వరూ?" బ్రతిమాలాను.

మరుక్షణంలో వారు ఉగ్రులైపోయారు.

"ఎన్నిమార్లు చెప్పినా నువ్వీ మంకుతనం వదలవన్న మాట...సరే నీ ఇష్టం...నేనూ చూస్తాను ఎలా మానవో..."

నేనేమీ మాట్లాడలేదు. మౌనంగా వెళ్ళి పడుకున్నాను. వారు నిశ్చింతగా నిద్రపోయారు. అందనిపండ్లే రుచి. అవకాశం లేనప్పుడే ఆతురత!

వారు నిద్రపోగానే లేచి కూర్చున్నాను...ఒక రెండు, మూడు రాత్రులు గడిచిపోయాయి. ఇక ఈరోజు పూర్తయి పోయింది. ఈ మూడురోజులూ రాత్రిళ్ళు వారికి మెలుకువ రాలేదు...ఏ గొడవా లేదు. ఈ ఒక రాత్రి గడిచిపోతే... ఇంకా మూడు రోజుల టైముంది. తప్పక చేరుతుంది.

వ్రాస్తున్నాను...హఠాత్తుగా వారినిచూచి కంపించి పోయాను. చేతిలో ఈ మూడు రోజుల్నుంచీ వ్రాసిన కాగితాలు!

"అయిపోయింది...ఇక రేపు పోస్టుచేస్తాను..." అన్నాను చివరి కాగితం తీసుకుని లేస్తూ. గంట అర్థరాత్రి రెండున్నర!

గబుక్కున కాగితాలన్నీ లాక్కున్నారు. అగ్గిపుల్ల గీచేశారు!

మండుతున్న కాగితాల్ని చూచి నా హృదయం మండి పోయింది!

"నీకింత పంతమా? నాకు ఇష్టంలేనిపని ఎందుకు చేయాలి?"

వారి మాటలు నాకు విన్పించలేదు.

నెలరోజులుగా బుర్ర బద్దలుకొట్టుకుని చక్కగా నిర్మించిన ఊహాసౌధం కాలి మసిఅయి కూలిపోతోంది. రాత్రిళ్లు నిద్ర చంపుకుని, వారు లేస్తారనే భయంతో, చేతులు నొప్పిపెట్టేలా వ్రాసిన ఆ వ్రాత మండిపోతోంది, కాదు

నా హృదయంలోనుంచి మథించి తీసిన కల్పనాశక్తి మండి పోతోంది. నా భావావేశపు సుందరస్వప్నం దగ్ధమై పోతోంది!

నిర్లిప్తత ఆవరించింది.

"ఇక వ్రాయను...వ్రాయాలనీ లేదు. వ్రాయలేను కూడా!"

"రాధా!"

"అవునండీ! మీ కిష్టం లేకుండా ఈ రచనాశక్తి ఉన్నా, లేకున్నా ఒకటే! ప్రోత్సాహంలేని విద్యకు ఫలిత మేముందీ?"

దుఃఖం రాలేదు! కన్నీళ్ళు రాలేదు...పదిమంది బిడ్డలు పుట్టి చనిపోయి, పదకొండవ బిడ్డను మట్టిలో పారేసి వస్తున్న మాతృహృదయపు నిర్వేదం నన్నావరించిం దొక్క సారిగా!

మళ్ళీ వ్రాయలేదు. వ్రాయాలనీ లేదు. ఆ కల్పనా శక్తి నాలో లేదు.

గాయత్రీ! మళ్ళీ పోటీ వచ్చింది. ఇంకా వస్తుంది. ఇలా ఎన్నో కథలపోటీలు నిర్వహిస్తారు. ఎందరో తమ రచనలు పంపుతారు. అందులో ఏవో బహుమానార్హమని ప్రకటితమవుతాయి. కానీ నాది మాత్రం రాదు. అసలా రచనా పరంపరలలోనే నా రచన ఉండదు! నేను వ్రాయలేను.

వ్రాయగలిగే వ్రాయలేను. అంతే! ఆ రాధ చనిపోయింది... ఇప్పుడున్న ఈ రాధ (నేను) లో జీవం ఉంది. జీవకళ లేదు.

భావాలున్నాయి. అనువదించే భాష లేదు. కల్పన ఉంది. కవిత చచ్చిపోయింది...జీవితంలో హృదయాన్ని స్పందింపజేసే దివ్యనాదంలోపిస్తే మిగిలేది అంతమే కదూ!

నీ
"రాధ"